క్లుప్తంగా

ముగిసిన ధనుర్మాస పూజలు



సిద్ధేశ్వరస్వామి మూలవిరాట్

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన సిద్ధేశ్వర స్వామికి ఆదివారం ధనుర్మాస ముగింపు పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. అంతకుముందు స్వామికి జలాభిషేక పూజ, ఆకుపూజ, కుంకుమార్చన, బిల్వార్చన, సహస్ర బిల్వార్చన, పంచామృతాభిషేకం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు రాజపంపన్న గౌడ్, శివశంకర్ గౌడ్, సిద్ధార్థగౌడ్, ఆలయ అభివృద్ధి, దాసోహ కమిటీ ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రుద్రాభిషేక పూజల్లో పాల్గొనగా ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

యువకుడి ఆత్మహత్య



లోకేష్ (ఫైల్)

మద్దికెర: మండలానికి చెందిన యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన మొలగవల్లి శివరంగడు, శ్రీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు లోకేష్ (25) అనే యువకుడు జీవితంపై విరక్తితో ఆదివారం కర్నూలులో ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు డిగ్రీ పూర్తి చేసి గత కొన్ని నెలలుగా కర్నూలులో ఉంటూ ప్రైవేట్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగం కోసం సిద్ధమవుతున్నాడు. అయితే ఏమైందో తెలియదు గానీ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



అక్షింతలకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

మద్దికెర: అయోధ్య శ్రీరాముని అక్షింతలు ప్రతి ఇంటికీ అందజేయనున్నట్లు స్థానిక కోదండరామస్వామి ఆలయ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, లింగప్ప ఆదివారం తెలిపారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేసిన అనంతరం ప్రతి హిందువూ తమ ఇళ్లలో, శ్రీరామ ఆలయాల్లో దేవుడికి సమర్పించాలని సూచించారు. సాయంత్రం ఇళ్లలో దీపాలు వెలిగించి పూజలు చేయాలన్నారు.

17న ఉచిత వైద్య శిబిరం

మద్దికెర: మండల కేంద్రమైన మద్దికెరలో ఈనెల 17వ తేదీ బేతేలు క్రిస్టియన్, ఆపద్బాంధవ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక బేతేలు నిలయం గుంతకల్లు రోడ్ వద్ద ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్, రాజశేఖర్, మధు, రాజు ఆదివారం తెలిపారు. అనంతపురం కిమ్స్ సవేరా హాస్పిటల్స్ వారు జీఆర్‌బీఎస్ బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్స్ చేస్తారని తెలిపారు. క్యాంపునకు వచ్చే వారు ఆధార్ కార్డు తీసుకొని రావాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

నందవరం: మండలంలోని నాగలదిన్నె గ్రామంలోని బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మాట్లాడుతూ.. మండల పరిధిలోని రాయచోటి గ్రామానికి చెందిన తెలుగు రామాంజనేయులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారన్నారు. నిందితుడి వద్ద నుంచి కర్ణాటక మద్యం 384 జాన్స్ ఒరిజినల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

ప్రశాంతంగా జీవించండి

దేవనకొండ: గ్రామాల్లోని ప్రజలు అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని దేవనకొండ సీఐ శ్రీనివాసులు సూచించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం మండలంలోని పి.కోటకొండ గ్రామంలో ప్రజలకు పోలీసు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రజలు పిల్లలను చదివించడంలోనూ, ఆర్థికంగా రాణించడంలోనూ ముందుండాలన్నారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం రౌడీషీటర్ల ఇళ్లను తనిఖీ చేసి, వారికి హెచ్చరికలు జారీ చేశారు. మంచిగా బతకాలని, అల్లర్లు, గొడవలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఎల్లార్తి ప్రభుత్వ కన్నడ పాఠశాల భవనం



చిన్నారుల్లో శుభ్రతపై స్ఫూర్తి నింపేలా పాఠశాల గోడపై చిత్రం

ఊరి బడి.. మెరుగు'బడి'

- కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు
- చిన్నారులను ఆకర్షించేలా రంగుల చిత్రాలు



హైక్లాస్‌ను తలపిస్తున్న టాయిలెట్



హొళగుంద: గత టీడీపీ పాలనలో కళావిహీనంగా ఉన్న గవర్నమెంట్ స్కూళ్లు నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రూపురేఖలే మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి వైపు దూసుకెళ్తున్నాయి. 'నాడు-నేడు' కార్యక్రమంతో మరింత కళను సంతరించుకున్నాయి. హొళగుంద మండలంలో మొత్తం 24 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, కేజీబీవీతో కలిపి 7 ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలో 8,600 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నాడు- నేడు పథకం కింద నిధులు మంజూరు కావడంతో అన్ని పనులు పూర్తి చేసుకున్న పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా సరికొత్త కళను సంతరించుకున్నాయి. పాఠశాలలో ఫర్నీచర్, ఫ్యాన్లు, తాగునీరు, సింక్, గోడలపై చిన్నారులు త్వరతిగతిన అక్షరాలు, అంకెలు, పదాలు నేర్చుకునేలా బొమ్మలు, చిత్రాలు వేసి ఏదో కొత్త లోకానికి వచ్చినట్లు ఫీలయ్యేలా తీర్చిదిద్దారు. అవసరమైన అన్ని హంగులతో వసతులు కల్పించి విద్యార్థులకు కొత్త అనుభూతిని అందిస్తున్నారు.



రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయ్‌లెట్

రూ.12 కోట్లతో నాడు-నేడు పనులు



మండలంలో దాదాపు రూ.12 కోట్లతో నాడు-నేడు కింద 35 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో కొత్త రూపు సంతరించుకున్నాయి. నాబార్డ్ నిధులు రూ.రెండు కోట్లతో హొళగుంద జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాంపౌండ్ వాల్, తరగతి గదులు, వసతులు ఇతర అనేక సదుపాయాలతో పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. పలు చోట్ల నిర్మాణ పనులు పూర్తికాగా కొన్ని చోట్ల మాత్రం ముగింపు దశలో ఉన్నాయి.

– సోమప్ప, పీఆర్ ఏఈ, హొళగుంద

కార్పొరేట్ స్కూళ్లను తలపిస్తున్నాయి



కర్ణాటక సరిహద్దులో ఎల్లార్తి కన్నడ ఆదర్శ పాఠశాల అన్ని హంగులతో కార్పొరేట్ స్థాయిలో ఉంది. పాఠశాల కొత్తకళను సంతరించుకుంది. ఆహ్లాదకర వాతవరణం మధ్య నాణ్యమైన బోధనతో విద్యార్థులు చదువులో బాగా రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వేలాది కోట్ల నిధులు వెచ్చించి పాఠశాలల్లో ఎలాంటి కొరత లేకుండా పిల్లలు క్రమశిక్షణతో చదివేలా చేసి అక్షరాస్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

– దర్గన్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎల్లార్తి

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



ఆస్పరిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న రామకృష్ణ

ఆస్పరి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం ఆస్పరి యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వాహకులు రామకృష్ణ ప్రారంభించారు. పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు అరవింద్, విజయ్‌కుమార్, మహేష్, నరసింహ, హేమంత్, రాజు, బాలముని, నరసప్ప పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆస్పరిలో నారాయణ ప్రైమ్ స్కూల్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతలకు ఆదివారం ఏఎస్‌ఐ ప్రనేశ్వర్ బహుమతుల ప్రదానం చేశారు. మొదటి బహుమతి గెలుచుకున్న జొహరాపురం జట్టుకు రూ.5116, రెండవ బహుమతి ఆస్పరి జట్టుకు రూ.3116 ఏఎస్‌ఐ అందజేశారు. హెచ్‌ఎం నరేష్ ఆచారి, హెడ్ కానిస్టేబుల్ రామాంజినయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కొలుకోలేక వ్యక్తి మృతి



మృతి చెందిన గొంగళ్ల మధుకృష్ణ

కృష్ణగిరి: బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కృష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన గొంగళ్ల మధుకృష్ణ (33), రాధిక దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు వ్యవసాయం, అలాగే మధుకృష్ణ మోటార్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 10న మధుకృష్ణ, అన్న గొంగళ్ల బాలమద్దయ్యతో కలిసి మోటార్‌సైకిల్‌పై డోన్‌కు వెళ్లి మిరప పంటకు మందులు తీసుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో కోయిలకొండ వద్ద బైక్‌కు కుక్క అడ్డురావడంతో అదుపు తప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో మధుకృష్ణ తలకు బలమైన గాయమైంది. అక్కడున్న వారు అతన్ని డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు జీజీహెచ్‌కు రెఫర్ చేశారు. అక్కడి చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మధుకృష్ణ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

జీఓలు తగలబెట్టడం అహంకార చర్య

తుగ్గలి: ప్రభుత్వ జీఓలను తగలబెట్టడం టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ నాయకుల దురహంకారానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్ విమర్శించారు. ఆయన ఆదివారం జి.ఎర్రగుడిలో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతి జీఓ ప్రజా ప్రయోజనాల కోసమేనన్నారు. గతేడాది తెచ్చిన జీఓ నంబర్ వన్ ద్వారా.. ప్రజలకు ప్రాణహాని లేకుండా సభలు నిర్వహించుకోవచ్చనే విషయాన్ని టీడీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ చర్యలను తప్పుపట్టాలన్న ఉద్దేశంతోనే టీడీపీ నాయకులు అలా ప్రవర్తిస్తున్నారని, త్వరలోనే ఆ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబునాయుడుకు ప్రజలకు ఏమీ చేయకపోగా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచేసి వెళ్లారని ఆరోపించారు. అలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి అయిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన విజన్‌తో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి అత్యుత్తమ పాలన అందిస్తున్నారని కొనియాడారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు.


శబరిమలకు తరలిన అయ్యప్ప మాలధారులు



పగిడిరాయి నుంచి శబరిమలకు బయలుదేరుతున్న అయ్యప్ప మాలధారులు

తుగ్గలి: 41 రోజుల పాటు కఠిన దీక్ష సాగించిన అయ్యప్ప భక్తులు ఆదివారం శబరిమలకు బయలుదేరి వెళ్లారు. అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం సందర్భంగా ఆదివారం పగిడిరాయిలో ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అయ్యప్ప స్వాములు, వారి కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున తరలివచ్చారు. హరిహరసుతుడికి విశిష్ట పూజలు నిర్వహించిన అనంతరం గురుస్వాములు భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టారు. అనంతరం మాలధారులు శబరిమలకి బయలుదేరారు.

కనులపండువగా కల్యాణోత్సవం



గోదాదేవి, రంగనాథస్వామి స్వామివార్ల కల్యాణోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీరంగనాథుడు, గోదాదేవి అమ్మవార్ల కల్యాణోత్సవం ఆదివారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ముందుగా స్వామివార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేద పండితులు గోదాదేవి, రంగనాథస్వామి వార్ల ఉత్సవమూర్తులను పెళ్లిపీటలపై కొలువుంచి మంత్రోచ్ఛరణలు భక్తాదుల మధ్య కల్యాణోత్సవం జరిపించారు. గ్రామపుర వీధుల గుండా ప్రభోత్సవం నిర్వహించారు. ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్ పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలయేసు పుణ్యక్షేత్ర మహోత్సవాలు



గురువులను సన్మానిస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చిలో బాలయేసు పుణ్యక్షేత్ర మహోత్సవాలను ఆదివారం మత గురువులు, క్రైస్తవులు వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్తుతి ప్రార్థనలు, దివ్య సత్ప్రసాద ఆరాధన, వ్యాధిగ్రస్తుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆంతోని పూల సమిష్టి బలి పూజలు నిర్వహించారు. తర్వాత మేత్రాణులకు సన్మానం చేశారు. అనంతరం శాంతికి చిహ్నంగా కొవ్వొత్తులు వెలిగించారు. సాయంత్రం బాలయేసు స్వరూపాన్ని గ్రామ పురవీధుల గుండా ప్రార్థనలు చేసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. స్థానికులే గాక గుంతకల్లు, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు. చర్చికి వచ్చిన వారికి స్థానికులు బైరెడ్డి ఆనంద్ అన్నదానం చేశారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు



ముగతిలో డ్రైయినేజీ, రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలో కలగట్ల రోడ్డులో డ్రైయినేజీ పనులు పూర్తి చేశారు. సాదు గుడి నుంచి పంపయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు పనులు సాగుతున్నాయి. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీలో మాదిగ భారతమ్మ కొట్టం నుంచి లాజర్ ఇంటి వరకు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షలు, ఎస్టీ, ఎస్సీ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైయినేజీ పనులు చేపట్టినట్లు పీఆర్ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయని సర్పంచ్ విరుపాక్షిరెడ్డి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన ఈడిగ చిరంజీవి

దేవనకొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో పండగ పూట ఆ ఇంట విషాదం నెలకొంది. బంటుపల్లి గ్రామానికి చెందిన ఈడిగ చిరంజీవి(24) డిగ్రీ పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండగను తన కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని హైదరాబాద్ నుంచి బైకుపై తన స్నేహితుడు బాలకృష్ణతో కలిసి బయలుదేరాడు. ఈదులదేవరబండ సమీపంలోని వీరంపల్లి స్టేజి వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొని చిరంజీవి అక్కడికక్కడే మృతిచెందారు. వెనకాల ఉన్న బాలకృష్ణ తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చిరంజీవి ఒక్కడే కుమారుడు కావడంతో ఆ ఇంటిలో పండగ పూట విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా భోగి సంబరాలు



వెల్దుర్తిలో భోగి మంట వేసిన ఆర్యవైశ్య కుటుంబీకులు



బహుమతులు అందజేస్తున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

కృష్ణగిరి: ధాన్యం దిగుబడులు ఇంటికి చేరే సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని ప్రతి ఇంటా సంతోషాలు వెల్లివిరియాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అభిలషించారు. కర్నూలులోని తన స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి భోగి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటి ముంగిట రంగుల ముగ్గు వేసి గొబ్బెమ్మలను ఉంచారు. ఉదయం భోగి మంటలు వేసి ఆహ్లాదంగా గడిపారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి దీవించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి పండుగ సంబరాల్లో మొదటి రోజు భోగిని ఆదివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉదయాన్నే తమ ఇళ్ల ముంగిట ముగ్గులు వేయగా, భోగి మంటలు వేసి కుటుంబసభ్యులు బంధుమిత్రులతో కలిసి చిన్నా పెద్దా సందడి చేశారు. నువ్వులు, ధాన్యాలతో కూడిన పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. గాలిపటాల సంబరాలు, అక్కడక్కడా డూడూ బసవన్నలు కనిపించాయి. సాయంత్రం చిన్నారులకు రేగి పండ్లు, చెరుకు ముక్కలు, చాక్లెట్లు, చిల్లర నాణేలు కలిపి తలపై పోస్తూ పెద్దలు దీవించారు.



ముగ్గు వేసి గొబ్బెమ్మలు పెడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

చిప్పగిరి: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో భోగి పండుగ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. చిప్పగిరి మండలంలోని గుమ్మనూరు గ్రామంలో ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. బసప్ప, శ్రీధర్, బాలాజీ, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి గెలిపించుకుందాం

హాలహర్వి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకుందామని ఎంపీపీ నెట్టికంటమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆమె స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. సీఎం జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 20 కుటుంబాలు ఆదివారం ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినే విరుపాక్షి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి విరుపాక్షి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు మెచ్చి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. నేమకల్లు సర్పంచ్ ప్రేమ్‌కుమార్, నాగరాజు, సుధ, సూరి, సుంకన్న, ఈరన్న, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి



మృతుడు శేషారెడ్డి (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): కృష్ణగిరి మండలం తొగర్చేడు ప్రాథమికోన్నత (ఎంపీయూపీ) పాఠశాల గణిత ఉపాధ్యాయుడు ఎన్‌వీ శేషారెడ్డి (51) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచాడు. వెల్దుర్తి పట్టణానికి చెందిన శేషారెడ్డి 1998లో చెరుకులపాడు స్కూల్‌లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. భార్య కృష్ణవేణి సైతం ఉపాధ్యాయురాలు కాగా ప్రస్తుతం దేవనకొండ మండలంలో విధులు నిర్వహిస్తూ కుటుంబం కర్నూలులో నివాసముంటున్నారు. వెన్నుముక, ఊపిరితిత్తుల సమస్యతో తీవ్ర అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లిన శేషారెడ్డి కోలుకోలేక ఆదివారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల తోటి ఉపాధ్యాయులు, యూటీఎఫ్ ప్రతినిధులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బీసీలపై టీడీపీ కపట ప్రేమ



దేవరగట్టులో పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి

చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తూ బీసీలపై టీడీపీ కపట ప్రేమ ప్రదర్శిస్తోందని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయ కర్త బుసినే విరుపాక్షి పేర్కొన్నారు. ఆయన ఆదివారం దేవరగట్టులోని మాల మల్లేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెనుకబడిన బీసీలను గుర్తించి అన్నిరంగాలలో సముచిత స్థానం కల్పించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను విస్మరించి ఇప్పుడు జయహో బీసీ అంటూ వారిని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు ఓబులేష్, లోకనాథ్, మల్లికార్జున, మహానంది తదితరులు ఉన్నారు.

వెల్దుర్తిలో క్రికెట్ టోర్నీ ప్రారంభం



డాక్టర్ వరప్రసాద్, అతిథులతో కలిసి టోర్నీ ప్రారంభిస్తున్న ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక బాలుర జెడ్పీ హైస్కూల్‌లో సూపర్–8 టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న క్రీడాకారుడు డాక్టర్ వరప్రసాద్ (చిన్న)ను ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు సన్మానించారు. అనంతరం టోర్నీని డాక్టర్, అతిథులతో కలిసి ఎస్‌ఐ ప్రారంభించారు. క్రీడాస్ఫూర్తితో ఆడుతూ ఉన్నతంగా ఎదగాలని ఎస్‌ఐ సూచించారు. స్థానిక టీవీఎస్ మినరల్స్ వారు విన్నర్స్, రన్నర్స్‌కు రూ.10,016, రూ.5,016 నగదు బహుమతులను అందించనుండగా నిర్వాహకుడు వెంకట్‌నాయుడు ట్రోఫీలు అందించనున్నారు. ప్రారంభ కార్యక్రమంలో నాయకులు వెంకట్‌నాయుడు, సీనియర్ క్రీడాకారులు బాచి, సుధీర్, చిరంజీవి, అయ్యాస్వామి, హాఫీజ్ పాల్గొన్నారు. టోర్నీలో 30 జట్లకు పైగా పాల్గొంటుండగా ప్రారంభ మ్యాచ్‌లో వెల్దుర్తి సీనియర్స్ జట్టుపై మల్లెపల్లె జట్టు విజయం సాధించింది. మూడు రోజులపాటు టోర్నీ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శరవేగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు



పూలచింతలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆర్బీకే



నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం

నందవరం: మండల పరిధిలోని పూలచింత గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. గ్రామ సచివాలయం, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ పనులను పంచాయతీ రాజ్ అధికారులు ముమ్మరం చేశారు. ప్రభుత్వం భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పూర్తిగా చెల్లించడంతో పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం గ్రామ సచివాలయానికి రూ.40 లక్షలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు నిధులు మంజూరు చేసింది. రైతు భరోసా కేంద్రం పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. సచివాలయంలో బండ పరుపు, పెయింటింగ్ పనులు జరుగుతున్నాయని, ఈ నెలాఖరుకల్లా పనులు పూర్తి చేశామని పీఆర్ అధికారులు చెబుతున్నారు.

తాగునీరు వృథా



దేవనకొండ పోలీస్‌స్టేషన్ వద్ద పైపులైన్ పగలడంతో నీరు లీకవుతున్న దృశ్యం

దేవనకొండ: స్థానిక మాలవీధి ప్రధాన రహదారి వెంబడి ఉన్న మంచినీటి పైపులైన్ లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. మురుగునీటిలో పైపులైన్ ఉండడంతో నీరు కలుషితమవుతోంది. అలాగే పోలీస్ స్టేషన్ ముందు పైపులైన్ పగలడంతో నీరు వృథాగా పోతోంది. నీరు కలుషితం కావడంతో అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.